www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 1 డిసెంబర్ 2023
5
తిరుపతి



'అసమర్ధుని జీవయాత్ర' అద్భుత సాహిత్యం



ప్రజాశక్తి-పాకాల

తెలుగు సాహిత్యంలో నవలకు విశిష్ట స్థానం ఉందని సంజయ్ గాంధీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు విభాగ అధ్యక్షులు డాక్టర్ శ్రీనివాసులు రెడ్డి అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు విభాగం ఆధ్వర్యంలో గురువారం 'అసమర్ధుని జీవయాత్ర' అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్రిపురనేని గోపీచంద్ నవలలు తెలుగు సాహిత్యాన్ని సరికొత్త మలుపు తిప్పాయని అన్నారు. ఆయన నవలల్లో మనో వైజ్ఞానిక తాత్విక దృక్పథాలు ప్రధానంగా చోటుచేసుకున్నాయని అన్నారు. పాకాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రధానాచార్యులు డాక్టర్ మొహిద్దీన్ భాష మాట్లాడుతూ నవలలు చదవడం ద్వారా ఆనాటి సమాజం అర్థమవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు అధ్యాపకులు డాక్టర్ ఈశ్వర బాబు, ఎస్ వి రమేష్ కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.



ప్రభుత్వ స్థలాలకు రక్షణ ఏది : సిపిఎం

ప్రజాశక్తి - రేణిగుంట

పంచాయతీ స్వాధీనంలో ఉన్న స్థలాలలో అక్రమ కట్టడాల పనులను వెంటనే ఆపాలని గురువారం మధ్యాహ్నం ఈవోకు సిపిఎం నాయకులు కె.సెల్వరాజ్, ఒ.వెంకటరమణ, కుప్పస్వామి, సిఐటియు అధ్యక్షులు టి.నరసింహారెడ్డి వినతిపత్రం అందజేశారు. సిపిఎం నాయకులు మాట్లాడుతూ పాంచాలినగర్ నాగార్జున పబ్లిక్ స్కూలు ఎదురుగా గ్రామ పంచాయతీ బోరు వేసి గత 30 ఏళ్లుగా పంచాయతీ స్వాధీనంలో వాటర్ పంపు సెట్టు స్థలం ఉంది. గతం నుంచి ఈ స్థలం ఆక్రమణకు గురికాకుండా పంచాయతీ అధికారులు అడ్డుకుంటూ వచ్చారు. అయితే ప్రస్తుతం పంచాయతీ కార్యదర్శి, బోర్డు సభ్యుల నిర్లక్ష్యం వల్ల ఆ స్థలంలో ఆక్రమణదారులు నిర్మాణ పనులు చేస్తున్నారు. కొంతమంది వెళ్లి అడిగితే పంచాయతీ అప్రూవల్ ఉందని చెప్పడం విమర్శలకు తావిస్తోంది. గతంలో ఆ స్థలంలో పంచాయతీ బోరు పంపు సెట్టు ఉందనే సమాచారం తెలిసిన వెంటనే పంచాయతీ సెక్రటరీ ఇచ్చిన అప్రూవల్‌ను అప్పటి సెక్రటరీ బసిరెడ్డి రద్దు చేశారు. ఇప్పటికైనా నిర్మాణ పనులను వెంటనే ఆపి, పంచాయతీ స్థలాన్ని కాపాడాలని పంచాయతీ కార్యదర్శి రవి శంకర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శిని వివరణ కోరగా పంచాయతీ స్థలంలో అక్రమ కట్టడాలు కడితే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

రూ.1.51 కోట్ల వైద్యపరికరాలు విరాళం

ప్రజాశక్తి - తిరుపతి సిటి

తిరుపతిలోని శ్రీ పద్మావతి చిన్నపిల్లల ఆసుపత్రికి బెంగళూరుకు చెందిన హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ సంస్థ రూ.1.51 కోట్ల విలువైన వైద్యపరికరాలు కొనుగోలుకు విరాళం అందించారు. ఈ మేరకు గురువారం టీటీడీ పరిపాలన భవనంలో ఈవో ఎవి.ధర్మారెడ్డి సమక్షంలో ఆ సంస్థ ప్రతినిధులు, ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ శ్రీనాథరెడ్డితో ఎంఓయు కుదుర్చుకున్నారు. హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ సంస్థ సిఎండి సిబి.అనంతకష్ణన్ మాట్లాడుతూ టీటీడీ ఆధ్వర్యంలోని శ్రీ పద్మావతి చిన్నపిల్లల హదయాలయ అద్భుతమైన సేవలు అందిస్తోందని, ఎంతో మంది పేదలు మెరుగైన గుండె వైద్యసేవలు పొందుతున్నారని కొనియాడారు. ఈ ఆసుపత్రికి అవసరమైన మూడు ఆపరేషన్ థియేటర్‌లలో అనస్థీషియా వర్క్ స్టేషన్ వెంటిలేటర్స్ విత్ మానిటర్స్ కొనుగోలుకు కార్పొరేట్ సామాజిక బాధ్యతగా విరాళం అందించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెఈవో సదా భార్గవి, సీవీఎస్వో నరసింహ కిషోర్, సంస్థ హెచ్ఆర్ డైరెక్టర్ ఎబి.ప్రధాన్, సీనియర్ మేనేజర్ సౌమెన్ చౌదరి, ఎఫ్ఏసిఏవో బాలాజి, అదనపు ఎఫ్ఏసిఏవో రవిప్రసాదు పాల్గొన్నారు.



రూ.69 లక్షలట...



'రేణిగుంట -కడప' రోడ్డు విస్తరణలో..

కమీషన్ ఇచ్చిన వారికి ఐదారింతలు ఎక్కువ
లంచమివ్వలేదని తక్కువ ఇచ్చారంటున్న పేదలు

రూ.30 లక్షలట..



నచ్చి(నోళ్లకు)నట్లుగా 'నష్ట'పరిహారం

రేణిగుంట - కడప నాలుగు లైన్ల రోడ్డు విస్తరణ పనులకు గత ఏడాది రెవెన్యూ, నేషనల్ హైవే యంత్రాంగం భూసేకరణ చేపట్టారు. అయితే కొంతమంది రెవెన్యూ యంత్రాంగం ప్రజాప్రతినిధులతో, దళారులతో కుమ్మక్కయ్యి 'కమీషన్' కుంభకోణాన్ని తెరపైకి తెచ్చారు.. కమీషన్ ఇచ్చిన వారికి ఐదారింతలు ఎక్కువగా, ఇవ్వలేని పేదలకు తక్కువగా నష్టపరిహారాన్ని అందజేసి 'వివక్ష' పాటించారు. ఈ తారతమ్యమే పేదలను బాధించింది.. తరతరాలుగా తమ ఆధీనంలో ఉన్న భూమిని తీసుకుంటూ అధికార యంత్రాంగం 'కమీషన్' వ్యాపారం చేయడంపై గుర్రుమన్నారు. ఈ విషయాన్ని కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డికి, ఎంఎల్ఎ బియ్యపు మధుసూదన్‌రెడ్డికి, జిల్లా జాయింట్ కలెక్టర్‌కు, రేణిగుంట తహశీల్దార్‌కు, నేషనల్ హైవే రోడ్డు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా బాధితులకు న్యాయం జరగలేదు. దీంతో రోడ్డెక్కారు. తమకు న్యాయబద్ధమైన పరిహారం ఇచ్చేంత వరకూ 'వివక్ష' చూపిన అధికారులపై పోరాడతామని పేదలంతా ఒక్కటయ్యారు.

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

రేణిగుంట మండలం కరకంబాడి పంచాయతీ ఇంద్రనగర్‌లో 1987లో సర్వే నంబర్ 185/2లో మాజీ సైనికులకు ఇంటి పట్టాలను ఇచ్చారు. పన్నెండేళ్ల తరువాత 1993లో జీవో నంబర్ 117 ప్రకారం మాజీ సైనికుల నుంచి పేదలు ఈ భూములను కొనుగోలు చేశారు. ఇక్కడ 50 మంది పేదలు ఇళ్లు, షాపులు నిర్మించుకుని జీవిస్తున్నారు. రేణిగుంట - కడప మార్గంలో నాలుగు లైన్ల రహదారి భూసేకరణలో 50 మందికి సంబంధించిన వారు భూములు కోల్పోయారు. అయితే వారికి ఇచ్చే పరిహారంలో అవకతవకలు జరగడంతో వారి బాధ వర్ణనాతీతం. ఇక్కడ ఉన్న బాధితులు 50 మందికి రెండు సెంట్లు చొప్పున భూమి ఉంది. కొందరు ఇళ్లలోనే షాపులు నిర్మించుకుని ఉన్నారు. అయితే రెవెన్యూ అధికారులకు 50 శాతం కమీషన్ ఇవ్వలేదన్న సాకుతో వారికి నష్టపరిహారం 5-7 లక్షల రూపాయలుగా నిర్ణయించారు. 50శాతం కమీషన్ ఇచ్చిన వారికి మాత్రం 35 -39 లక్షలు ఇస్తున్నారు. మరికొన్నిచోట్ల చిన్న స్థలానికి 65 లక్షలు, కొంత పెద్ద స్థలం ఉన్నా 39 లక్షలు ఇస్తుండటం గమనార్హం. కడప జిల్లాకు చెందిన కొందరు రాజకీయ నేతలకూ ఎక్కువ నష్టపరిహారం ఇస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. మార్కెట్ విలువ ప్రకారం నష్టపరిహారం ఇవ్వడం లేదని, దళారులు, ప్రజాప్రతినిధులు చెప్పిన విధంగా పేదలకు నష్టపరిహారం ఇస్తున్నారని ఆందోళన చెందుతున్నారు. భూసేకరణలో ఇళ్లు కోల్పోయిన వారికి పరిహారంలో వ్యత్యాసం లేకుండా న్యాయబద్ధంగా ఇవ్వాలని కోరుతున్నారు.

మార్కెట్ విలువ ప్రకారం ఇవ్వాలి : ఎస్.హైదర్‌అలీ



రేణిగుంట - కడప నాలుగు లైన్ల జాతీయ రహదారి నిర్మాణానికి నా స్థలం పోయింది. మార్కెట్ విలువ ప్రకారం నా స్థలానికి నష్టపరిహారం ఇవ్వాలి. రెవెన్యూ అధికారులు చాలా తక్కువ పరిహారం ఇవ్వడానికి జాబితా తయారు చేయడం అన్యాయం. రెవెన్యూ, నేషనల్ హైవే రోడ్డు అధికారులు న్యాయం చేయాలి. రోడ్డు విస్తరణ వల్ల నా కుటుంబానికి ఉపాధి పోయింది.

50శాతం కమీషన్ అంగీకరించలేదు : లక్ష్మీదేవి



కరకంబాడి ఇందిరానగర్ పంచాయతీ పరిధిలో రోడ్డు విస్తరణ పేరుతో నా స్థలం పోయింది. రెవెన్యూ అధికారులు 50 శాతం కమీషన్ ఇవ్వాలని కోరారు. అందుకు మేం అంగీకరించలేదు. ఈ కారణంగా నష్టపరిహారం చెల్లింపు జాబితాలో మా పేర్లతో తక్కువ పరిహారం రాశారు. ఎంఎల్ఎ, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదు. మాకు న్యాయం చేసి ఆదుకోవాలి.



రేణిగుంట విమానాశ్రయం వద్ద చంద్రబాబును కలిసిన కుప్పం నియోజకవర్గ నేతలు

నేడు శ్రీవారిని దర్శించుకోనున్న చంద్రబాబు

ప్రజాశక్తి - తిరుమల

టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు గురువారం సాయంత్రం శ్రీవారి దర్శనార్ధం తిరుమలకు చెరుకున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి రాత్రి గాయత్రి నిలయంలో బస చేశారు. తిరుమల సంప్రదాయం మేరకు శుక్రవారం ఉదయం ముందుగా వరాహస్వామి వారిని చంద్రబాబు దర్శించుకోనున్నారు. ఉదయం 7.30 గంటలకు శ్రీవారిని దర్శించుకోనున్నారు. దర్శనానంతరం గాయత్రి నిలయంలో కాసేపు విశ్రాంతి తీసుకుని, 9.30 గంటలకు తిరుమల నుంచి రేణిగుంట విమానాశ్రయానికి బయల్దేరి వెళతారు. రేణిగుంట నుంచి విజయవాడకు వెళ్లనున్నారు. డిసెంబర్ రెండో వారంలో తన నియోజకవర్గమైన కుప్పంలో చంద్ర బాబు పర్యటించనున్నారు.

తిరుమలలోనే రాత్రికి బస

స్వాగతం పలికిన జిల్లా నేతలు

తిరుమల శ్రీవారిని దర్శించుకోవడానికి కుటుంబ సమేతంగా తిరుపతికి వచ్చిన మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును జనసేన పార్టీ ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షులు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ రేణిగుంట విమానాశ్రయంలో ఘనంగా స్వాగతం పలికారు. కుప్పం నియోజకవర్గ విస్తరణ విభాగ కమిటీ అధ్యక్షులు డాక్టర్ సురేష్ బాబు , సభ్యులు కన్నన్, రాజారామ్, జయ రామన్న, బాలాజీ, బాబు, రామచంద్రలు చంద్రబాబును కలిసారు. చిట్టమూరు మండల అధ్యక్షులు గణపర్తి కిషోర్ నాయుడు రేణిగుంట విమానాశ్రయం వద్ద స్వాగతం పలికారు. ఆయనతో పాటు గుంపర్ల చిన్నారావు, ఎస్కె రషీద్, కమతం పోలయ్య, ఆరూరు గిరిబాబు నాయులు పాల్గొన్నారు.



స్వాగతం పలుకుతున్న పసుపులేటి హరిప్రసాద్

వర్షం ఆటంకాలకు అప్రమత్తంగా ఉండండి : కమిషనర్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

తుపాన్ హెచ్చరికలను ప్రజలకు తెలియజేస్తూ, నగరంలో ఎక్కడైనా కాలువలు పొంగినా, చెట్లు కూలినా జేసిబీల సాయంతో తొలగించేలా సిద్ధంగా వుండాలని తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ హరిత ఐఎఎస్ అధికారులకు సూచించారు. మునిసిపల్ కార్పొరేషన్ సిబ్బంది అందరూ అప్రమత్తంగా వుంటూ అధిక వర్షం కారణంగా నిర్వహించాల్సిన విధులను చేపట్టేలా తగిన చర్యలను తీసుకోవాలని డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డి తెలిపారు. తిరుపతి నగరంలో రానున్న తుపాన్ హెచ్చరికలను దష్టిలో వుంచుకొని తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్లోని అన్ని విభాగాల అధిపతులతో కమిషనర్ హరిత ఐఎఎస్, డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలోని ప్రధాన కాలువలు శుభ్రంగా వుంటూ మురికి నీరు సాఫిగా ప్రవహించేలా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా లోతట్టు ప్రాంతాల్లోని డ్రైన్లపై దష్టి సారించాలన్నారు. అధిక వర్షంతో ఎక్కడైన మురికి కాలువలు బ్లాక్ అయ్యి నీరు రహదారులపై వస్తున్న పక్షంలో జేసీబిల సాయంతో పనులు చేపట్టేలా సిద్ధంగా వుండాలన్నారు. చెట్లు విరిగి రహదారుల్లో ట్రాఫిక్ సమస్యలు తలెత్తినప్పుడు నిమిషాల వ్యవధిలో తొలగించేలా సిబ్బంది, యంత్రాలు అందుబాటులో వుండాలన్నారు. తిరుపతిలో ఎక్కడైనా వర్షం వలన ఇబ్బందులు వుంటే 24 గంటలు పని చేసే మన హెల్ప్ లైన్ నంబర్ 08772256766 కి తెలియజేసేలా చూడాలన్నారు. సచివాలయ సిబ్బంది తమ ప్రాంతాల్లో నిత్యం వర్షం పట్ల జాగ్రత్తగా విధులు నిర్వహించాలన్నారు. పాత బిల్డింగులు, ఇళ్ళను గుర్తించి అప్రమత్తం చేయాలన్నారు. ఇంజనీరింగ్, శానిటేషన్ సిబ్బంది పూర్తి స్థాయిలో అందుబాటులో వుండాలని అనంతరం రేణిగుంట రోడ్డు హీరో హోండా షోరూమ్ వద్ద కుంగిన రోడ్డును కమిషనర్ పరిశీలిస్తూ ప్రమాద సూచిక బోర్డును ఏర్పాటు చేసి, త్వరగా మరమ్మత్తులు చేయాలని ఆదేశాలు జారీ చేసారు. ఈ సమావేశంలో ఉప కమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, మునిసిపల్ ఇంజనీర్లు చంద్రశేఖర్, వెంకట్రామిరెడ్డి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ రెడ్డి, శానిటరి సూపర్ వైజర్లు చెంచెయ్య, సుమతి పాల్గొన్నారు.



'కట్ట'లు తెంచుకున్న చెరువు

ప్రజాశక్తి - వెంకటగిరి రూరల్

తిరుపతి జిల్లా వెంకటగిరి మండలంలోని చింతగుంట గ్రామ జుమాను చెరువు లోని నీరు వధాగా పోతున్నాయని గురువారం స్థానిక రైతులు ఆవేదన చెందారు. వారం రోజులుగా కురుస్తున్న వర్షానికి జూమను కండ్రిక చెరువుకు వర్షపు నీరు వచ్చి సగం చెరువు నిండింది. అయితే కల్వర్టు దగ్గర వధాగా పోతున్నాయని పారుదల రైతులు బాధపడుతున్నారు. ఆ చెరువు కింద పారుదల 80 ఎకరాలు ఉండగా 30 ఎకరాలకు వ్యవసాయ సాగుకు నీళ్లు ఉండవని, పంటలు పండితే గాని జీవనాధారం లేదంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇరిగేషన్ అధికారులు కల్వర్టు కలుజు నిర్మాణం చేసి ఎత్తు తగ్గించడం వలన చెరువులో నీళ్లు లేకుండా వధాగా పోతున్నాయని, అధికారులు పరిశీలించి న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు.

ఎడతెరపి లేని వర్షాలతో రోడ్లు అధ్వానం

ప్రజాశక్తి -కోట

అల్పపీడనం ప్రభావంతో కోట మండలంలోని పరిసర ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ సందర్భంగా కోట, వాకాడు, చిట్టమూరు, చిల్లకూరు మండలాలో ఎడతెరిపిలేని వర్షం కురుస్తోంది. ఐదు రోజులుగా నియోజకవర్గ పరిధిలో ఓ మోస్తరు వర్షాలు పడుతున్న విషయం తెలిసిందే. భారీ వర్షానికి గూడూరు పట్టణంలోని రోడ్లు,డ్రైనేజీ పొంగిపొర్లుతున్నాయి. వర్షపు నీరుతో రోడ్లు రొచ్చు గాచెరువులను తలపిస్తున్నాయి. ఎడతెరిపిలేని వర్షంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.మరోవైపు వ్యవసాయానికి అనుకూలంగా వర్షాలు కురుస్తుండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. భారీ వర్షాల నేపథ్యంలో స్థిర ప్రాంతాల్లోని ప్రజలను అధికారులు అప్రమత్తం చేస్తూ మత్స్యకారులు ఎవ్వరూ వేటకు వెళ్ళవద్దని హెచ్చరికలు జారీ చేస్తున్నారు.

రూ.కోటి విలువైన మొబైల్ ఫోన్లు రికవరీ

ప్రజాశక్తి - తిరుపతి సిటి

రెండు నెలల వ్యవధిలో మొబైల్ హంట్ ద్వారా కోటి ఎనిమిది లక్షల రూపాయల విలువైన 600 మొబైల్ ఫోన్లు రికవరీ చేసినట్లు తిరుపతి ఎస్‌పి పరమేశ్వర్‌రెడ్డి తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మొబైల్ హంట్ (వాట్సాప్ 9490617873) అప్లికేషన్ సేవల ద్వారా వచ్చిన ఫిర్యాదులపై గతంలో జిల్లా వ్యాప్తంగా సెల్ ఫోన్ పోగొట్టుకున్న బాధితులకు ఆరు విడదలలో 2 కోట్ల 93 లక్షల 40వేల విలువ గల 1630 సెల్‌ఫోన్లు రికవరీ చేసి బాధితులకు అందజేశామన్నారు. ప్రస్తుతం ఏడో విడతలో రెండు నెలల వ్యవధిలోనే 600 ఫోన్లు రికవరీ చేశామన్నారు. బస్‌స్టేషన్లలో, రైల్వేస్టేషన్ లాంటి రద్దీ ప్రాంతాల్లో మొబైల్ ఫోన్లు ఎక్కువగా చోరీకి గురవుతున్నట్లు తెలిపారు. సెల్ ఫోన్ రికవరీలో ప్రతిభ కనబరిచిన సైబర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ ఓ.రామచంద్రారెడ్డి, సైబర్ క్రైమ్ సిబ్బందికి జిల్లా ఎస్పీ ప్రశంసా పత్రాలు అందజేసి, అభినందించినారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పిలు వెంకట్రావు, విమల కుమారి, సైబర్ సెల్ సిఐ రామచంద్ర రెడ్డి పాల్గొన్నారు.



కనకదాస జీవితం యువతకు స్ఫూర్తి:కలెక్టర్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం):

కనకదాస జయంతి కార్యక్రమాన్ని గురువారం జిల్లా బిసి వెల్ఫేర్ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యమానికి జిల్లా కలెక్టర్, కురువ సంఘ నాయకులు, సంబంధిత అధికారులతో కలిసి పాల్గొని కనకదాసు చిత్ర పటానికి ఘనంగా పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెంకటరమణ రెడ్డి మాట్లాడుతూ భక్త కనక దాస ఒక గొప్ప భక్తుడు, తత్వవేత్త అని మహనీయుల జీవితం, వారి అడుగు జాడలు యువత అలవర్చుకోవాలన్నారు. భక్త కనకదాస జయంతిని రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు కనకదాస జయంతిని రాష్ట్ర పండుగగా జరుపుకుంటున్నామని అన్నారు. కనకదాసు సైనిక కుటుంబంలో జన్మించి, గొప్ప సైనికుడిగా విధులు నిర్వహించారని యుద్ధంలో తనకు కలిగిన శారీరిక భాదలు, సంఘటనలు చూసిన తర్వాత మార్పు చెంది ఒక మహాకవిగా మారాడన్నారు. కులమతాలకు అతీతంగా అందరు సమానమేనని ఎవరికైనా మోక్షాన్ని పొందే అవకాశం ఉందని, గొప్పగా చెప్పిన వ్యక్తులలో కనకదాసు ప్రథమమన్నారు. కనకదాసకు తిరుపతికి ఎంతో అనుబంధం ఉందని, కన్నడలో కవిగా ఉన్నప్పటికీ ఎక్కువ కాలం తిరుపతిలోనే ఉన్నారన్నారు. డిసెంబర్ నెలలో జరగనున్న కుల గణనలో అందరూ తమ ఉపకుల వివరాలను నమోదు చేసుకోవాలన్నారు. కుల సంఘాల లోని నాయకులు తమ కులాల వారిని చైతన్య పరచేలా సమావేశాలు నిర్వహించాలన్నారు. సంఘం వారు తిరుపతిలో కనకదాస భవన నిర్మాణానికి స్థలం అడిగారని, పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామన్నారు. సంఘ సీనియర్ సభ్యులు జయన్న, జిల్లా బిసి వెల్ఫేర్ అధికారి భాస్కర్ రెడ్డి, కురువ సంఘ నాయకులు నంజుండప్ప, వెంకటనారాయణ పాల్గొన్నారు.

'చిన్న మల్లుగుంట'పై 'పెద్ద'ల కన్ను



'రెవెన్యూ' కనుసన్నల్లోనే...

చెరువు పూడ్చి దురాక్రమణ

ప్రజాశక్తి - యర్రావారిపాలెం

మండలంలోని ఉదయమాణిక్యం పంచాయతీలో ప్రభుత్వ భూమి ఆక్రముణకు గురైనట్లు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికులు మీడియాకు అందించిన రహస్య సమాచారం మేరకు.. మర్రి మాకులపల్లి సమీపంలో గానుగుచింత రోడ్డు పక్కన పెద్దకరివేపాకు గుట్టకు ఎదురుగా ఉన్నటువంటి చిన్నమల్లుకుంట పై అదే గ్రామానికి చెందిన కొంతమంది కన్ను పడింది. దీంతో రెవెన్యూ సహకారంతో చిన్నమల్లు కుంట నీటి చెరువును వారం రోజుల కింద ట్రాక్టర్లతో మట్టి తోలి చదును చేసి ఆక్రమించుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. దీనిపై స్థానికులు సమాచారం అందించడంతో పరిశీలించగా రెవెన్యూ రికార్డు ప్రకారం ఆక్రమించుకున్న భూమి చెరువు (చిన్నమల్లు కుంటచెరువు)గా రికార్డుల్లో ఉంది. దశాబ్దాల కాలంగా పేద రైతులు ఈ చెరువు నీటిని ఉపయోగించుకొని పంటలు పండించుకుంటున్నారు. అలాంటి చెరువును ఈరోజు రెవెన్యూ అధికారుల సహకారంతో చెరువులో మట్టి తోలి చదును చేసి ఆక్రమించుకుంటున్నా ఏమాత్రం పట్టించుకోవడం లేదు. ఆక్రమించుకున్న చెరువు భూమి దాదాపు 5 ఎకరాలు ఉంటుందని అంచనా. దీనిపై సంబంధిత రెవెన్యూ అధికారిని వివరణ కోరగా పొంతనలేని సమాధానం చెబుతూ మాట దాటవేయడం గమనార్హం. అయితే రెవెన్యూ అధికారుల సాక్షిగానే విఆర్ఒకు భారీగా ముడుపులు అందించే చెరువును పూడ్చి ఆక్రమించుకునే ప్రయత్నం జరిగిందని స్థానికులు చెబుతున్నారు. సంబంధిత అధికారులు విచారణ జరిపి చెరువును కాపాడాలని, లేనిపక్షంలో ఆర్‌డిఒ, కలెక్టర్ దృష్టికి తీసుకెళతామని స్థానికులు హెచ్చరిస్తున్నారు.

ఫిబ్రవరిలో తిరుపతి జగనన్న ఇళ్ల గృహప్రవేశాలు : కమిషనర్

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

తిరుపతి అర్బన్ పరిధిలోని వారికి కట్టిస్తున్న జగనన్న ఇళ్ళు సకాలంలో, నిర్ణయించిన మేరకు పూర్తి చేసేలా అధికారులు పనులు చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ హరిత ఐఎఎస్ ఆదేశాలు జారీ చేసారు. తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో గురువారం హౌసింగ్ అధికారులు, మునిసిపల్ కార్పొరేషన్ ఇంజనీరింగ్ అధికారులతో కమిషనర్ హరిత ప్రత్యేక సమావేశం నిర్వహించారు. డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ హరిత ఐఎఎస్ మాట్లాడుతూ తిరుపతి నియోజకవర్గంలోని అర్హులైన ప్రజలకు చిందేపల్లి, సూరప్పకశం, ఎం.కొత్తపల్లి, జీ పాళెం, కల్లూరు, టిసి అగ్రహారం లే అవట్లలో నిర్మిస్తున్న ఇళ్ళ నిర్మాణాలను వేగవంతం చేసి, అనుకున్న మేరకు జనవరి నెలాఖరు కంతా పూర్తి చేయాలని, ఫిబ్రవరిలో లబ్ధిదారులకు అందజేసేలా గహప్రవేశాలకు సిద్ధం చేయాలన్నారు. ఇటుకల కొరత రాకుండా ఇటుకలు తయారు చేసే వారితో ముందే అగ్రిమెంట్ చేసుకోవాలని, అదేవిధంగా సిమెంట్, ఇసుక కొరత రాకుండా ముందు జాగ్రత్తలు



తీసుకోవాలని కమిషనర్ హరిత సూచించారు. అన్ని లే అవుట్లలో నీరు, కరెంట్ అందుబాటులో వున్నాయని, ఎక్కడైన వాటిపై సమస్యలు వుంటె, తక్షణమే మరమ్మత్తులు చేయించి సిద్ధంగా వుంచుకోవాలన్నారు. ఇంజనీరింగ్, హౌసింగ్ అధికారులు సమన్వయంతో ఇంటి నిర్మాణ కాంట్రాక్టర్లతో పనులు చేయించాలని తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ హరిత ఐఎఎస్ సూచించారు. ఈ సమావేశంలో హౌసింగ్ ఓ.ఎస్.డి రామచంద్రారెడ్డి, పి.డి వెంకటేశ్వరరావు, డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, మునిసిపల్ ఇంజనీర్లు చంద్రశేఖర్, వెంకట్రామిరెడ్డి పాల్గొన్నారు.

ఓటర్ లిస్ట్ తుది జాబితాపై పూర్తి దృష్టి

ఓటర్ లిస్ట్ తుది జాబితాపై పూర్తి దృష్టి సారించాలని, ఎలాంటి పొరబాట్లకు తావు లేకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని తిరుపతి నియోజకవర్గం ఓటర్ నమోదు అధికారి, తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ హరిత ఐఎఎస్ అన్నారు. తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో గురువారం తిరుపతి జిల్లా కలెక్టర్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ అనంతరం తిరుపతి నియోజకవర్గంలో నియమించిన ఓటింగ్ నమోదు అదనపు అధికారులు, సిబ్బంది, సూపర్ వైజర్లు, బూత్ లెవల్ ఆఫీసర్స్ ను ఉద్దేశించి కమిషనర్ హరిత ఐఎఎస్ మాట్లాడుతూ కొత్త ఓటర్లుగా నమోదు చేయడం, మతి చెందిన వారి ఓట్లను తొలగించడంలో పూర్తి బాధ్యతాయుతంగా, ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు పని చేయాలన్నారు. ఫారమ్ 7 విషయంలో క్షేత్ర స్థాయిలో పరిశీలించి, తగిన ఆధారాలతో జాబితా రూపొందించాలన్నారు. ఈ సమావేశంలో ఓటర్ నమోదు అదనపు అధికారి, డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, ఆర్వోలు కె.ఎల్.వర్మ, సేతుమాధవ్, డిటి జీవన్, మేనేజర్ చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

అమెరికా అంతరిక్ష సంస్థకు శ్రీసిటీ-వీఆర్వీ ఉత్పత్తులు

ప్రజాశక్తి- వరదయ్యపాలెం

శ్రీసిటీలోని వీఆర్వీ ఆసియా పసిఫిక్ ప్రైవేట్ పరిశ్రమ గడిచిన వారంలో ఒక ప్రముఖ యుఎస్ ప్రైవేట్ అంతరిక్ష సంస్థకు పలు భారీ ద్రవ ఆక్సిజన్ నిల్వ ట్యాంకులను ఎగుమతి చేయడం ద్వారా ఒక ముఖ్యమైన మైలురాయిని అధిగమించింది. 37 మీటర్ల పొడవు, 6 మీటర్ల వ్యాసం, 200 టన్నుల బరువు కలిగిన ఈ భారీ నిల్వ ట్యాంక్, వి ఆర్ వి ఇంజనీరింగ్, క్రయోజెనిక్ టెక్నాలజీని అభివద్ధి చేయడంలో సంస్థ ప్రతిభను చాటి చెప్పింది. అంతరిక్ష రంగం అవసరాలకు అనుగుణంగా భారీ క్రయోజెనిక్ నిల్వ ట్యాంకుల తయారీలో ప్రపంచవ్యాప్త గుర్తింపు వీఆర్వీ కి దక్కిందని సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ జీఎల్ రంగ్నేకర్ తెలిపారు. 2019 మే నెలలో ఇస్రో యొక్క సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ షార్‌కు ద్రవ నైట్రోజన్ షీల్డ్‌తో కూడిన భారీ లిక్విడ్ హైడ్రోజన్ నిల్వ ట్యాంక్‌ను సరఫరా చేయడం ద్వారా ప్రత్యేక గుర్తింపు పొందింది. ఇటీవలి 'చంద్రయాన్' విజయవంతమైన ప్రయోగంలోను ఈ కంపెనీ ఉత్పత్తులు వినియోగించడం గమనార్హం. కోవిడ్-19 సంక్షోభ సమయంలో కీలక పాత్ర పోషించి దేశవ్యాప్తంగా వైద్య ఆక్సిజన్ సిలిండర్లు, నిల్వ ట్యాంకులను సరఫరా చేసింది. శ్రీసిటీ విరాళంగా తిరుపతి స్విమ్స్, బర్డ్, రుయా హాస్పిటల్స్ తో సహా తిరుపతి, నెల్లూరు జిల్లాలలోని ప్రభుత్వ ఆసుపత్రులకు అందచేసిన ఆక్సిజన్ నిల్వ ట్యాంకులను సకాలంలో సరఫరా చేసి వీఆర్వీ ఎంతో సహకరించింది.



అర్భాటంగా అప్పగించారు.. సదుపాయాలు మరిచారు.!

- సమస్యల వలయంలో టిడ్కో సముదాయం
- గోడు వినేవారు లేకపోయారంటూ కాలనీ వాసుల ఆరోపణ
- మౌలిక వసతులు లేమితో ఇబ్బందులు పడుతున్నామని అసహనం
- పాలకులు, అధికారులు కన్నెత్తైనా చూడలేదంటూ విమర్శలు

పేదలకు గూడు కల్పించేందుకు ప్రభుత్వం టిడ్కో ఇళ్లు కట్టించింది. సుమారు 1500మందికి పక్కా గృహ సముదాయాన్ని ఏర్పాటు చేసింది. అంత వరకు బాగానే ఉంది. ప్రభుత్వం మారిన తదుపరి పాలక వర్గం మార్క్ వేసుకోవడంలో కాస్త రంగుల ఆర్భాటం చేసి లబ్ధిదారులకు టిడ్కో ఇండ్లు అప్పగించారు. అక్కడి వాసులు ఇప్పుడు వసతులు లేమితో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారుల అలసత్వమో, పాలకుల నిర్లక్ష్యమో కానీ అక్కడి సమస్యలే ఇప్పుడు వారికి శాపంగా మరింది.



పిచ్చి మొక్కలు నిండి సమస్యల వలయంలో టిడ్కో గృహ సముదాయం, ఇన్‌సెట్‌లో బిందెలతో నీళ్లు మొసుకెళుతున్న కాలనీ వాసి





గృహ సముదాయంలో నీళ్లు రాక అవస్థలు పడుతున్న కాలనీ వసులు

ప్రజాశక్తి-గూడూరురూరల్: గూడూరు పట్టనంలో పేదలకు అవసరమయ్యే వసతి సముదాయాన్ని ఎపీ ప్రభుత్వం నిర్మించింది. అయితే 2019లో ఏర్పడ్డ పాలకపక్షం నాలుగేళ్ల తరువాత లబ్ధిదారులకు పార్టీ రంగులద్ది అందజేసింది. సుమారు 1500 కుంటుబాలకు ఈ ఇళ్లు ఇచ్చారు. కాగా ప్రస్తుతం అక్కడ 3వేల మంది నివాసం ఉంటున్నారు. అర్భాటంగా అందజేసిన పాలకులు వసతులు కల్పించకపోవడంతో నానా అవస్థలు పడుతున్నామని అక్కడి వాసులు ఆరోపిస్తున్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించడంలో వైఫల్యం..

గృహ సముదాయంలో మౌలిక సదుపాయాలు లేక సతమతమవుతున్నామని కాలనీ వాసులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పారిశుద్ధ్యలోపం, పైపులేను లీకేజీ, డ్రైనేజీ నిలిచి దుర్గంధం వెదజల్లుతోందని విమర్శలు గుప్పిస్తున్నారు.

తాగునీళ్ల కోసం అవస్థలు..

టిడ్కో సముదాయంలో నీళ్లు రాకపోవడంతో అక్కడి ప్రజలు ఎదుర్కొంటున్నారు. నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడంతో పాలకులు, అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఫలితం లేకపోయిందని కాలనీ వాసులు మండిపడుతున్నారు. ఖాళీ బిందెలతో మంచినీటి ట్యాంకర్ల వద్ద గంటల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి దాపరించిందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలకు వెళ్లే చిన్నపిల్లలు, చిరుద్యోగల పరిస్థితి ఉదయాన్నే నీటి కోసం పడుతున్న ఇబ్బందులు వర్ణణాతీతమే అని కాలనీ వాసులు వాపోతున్నారు. నెలల పాటు సమస్యలు వలయంలో జీవిస్తూ ఉన్నా.. అధికార వర్గం కన్నెత్తైనా చూడకపోయిందని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

పాలకా కరుణించవా ఇకనైనా..


పాలకులు పట్టించుకొని ఇకనైనా సమస్యలు తీర్చాలని అక్కడి కాలనీ వాసులు వేడుకుంటున్నారు. అధికారులు చొరవ తీసుకొని దోమలబెడద నుంచి విముక్తి కల్పించి, పారిశుద్ధ్యం, పైపులైను మరమ్మతులు చేసి అవస్థల నుంచి విముక్తి కలిగించాలని కోరుతున్నారు.

జగనన్నా.. కాలనీలకు ఇదే దారన్నా.!

- లే అవుట్‌కి దారి లేక లబ్ధిదారులు నానా తంటాలు
- రాకపోకలకు రోడ్డు వేయాలని వేడుకోలు



రైల్వే అండర్ బ్రిడ్జి కింద నిలిచిన వర్షను నీరు



జగనన్న కాలనీలకు వెళ్లే దారిలో గుంతల్లో చేరిన వర్షపు నీరు

ప్రజాశక్తి-గూడూరురూరల్:

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిరుపేదలకు పక్కా గృహాలు మంజూరు చేసి జగనన్న కాలనీలు నిర్మింస్తోంది. సదుద్దేశంతో నిర్మాణాలు చేపట్టినా రోడ్డు సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నామని లబ్ధిదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. గూడూరు రూరల్ పరిధిలో జగనన్న కాలనీలో ప్రభుత్వం 3650 ప్లాట్లు ఏర్పాటు చేసింది. అందులో గాంధీనగర్ రోడ్డు పక్కన 1867ప్లాట్లు, రైల్వే అండర్ బ్రిడ్జికి మరోవైపు 1790ప్లాట్లును ఏర్పాటు చేసింది. ప్రస్తుతం ఇప్పుడు అక్కడ 800గృహాలు నిర్మాణం పూర్తై లబ్ధిదారులు నివాసం ఉంటున్నారు.

అండర్ బ్రిడ్జి దాటాలంటేనే తప్పని తిప్పలు..

జగనన్న కాలనీల్లో ఏర్పాటు చేసిన ప్లాట్లుకు దారి సమస్య తీవ్ర ఇబ్బందులు కలుగుతోందని గృహలబ్ధిదారుల నుంచి ఉత్పన్నమవుతున్న ఆరోపణ. అవసరాలకు అటువెళ్లాలంటే నరకయాతన తప్పడం లేదని అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఒక వైపు నుంచి మరో వైపు ప్లాట్లుకు వెళ్లాలంటే రైల్వే అండర్ బ్రిడ్జి మార్గం ఒకటే ప్రత్యామ్నాయం. బ్రిడ్జి కింద వర్షపు నీరు నిండిపోవడంతో తిప్పలు తప్పడం లేదని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అత్యవసర సమయాల్లో ఆసుపత్రులకు నీట మునిగి అవస్థలు పడి దాటుకొని వెళ్లాల్సిందేనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

భారీ వాహనాలు రాకపోవడంతో ఏర్పడ్డ గుంతలు..

గృహ సముదాయానికి భారీ వాహనాలు రాకపోకలు జరుగుతుండటంతో రోడ్డంతా గుంతలమయమైంది. ఇసుక లారీలు, టిప్పర్లు భారీ లోడ్‌తో అటుగా వెళుతున్నాయని దీంతో గుంతలు ఏర్పడి నీరు నిలిచి బురదలో పాట్లు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఏపీఈఆర్సీకి వార్షిక ఆదాయ అవసరాల నివేదిక



ప్రజాశక్తి-తిరుపతి బ్యూరో: ఏపీ విద్యుత్ నియంత్రణ మండలికి 2024-25 ఆర్థిక సంవత్సరానికి వార్షిక ఆదాయ అవసరాల నివేదికను గురువారం డిస్కంలు అందజేశాయి. బహుళ వార్షిక కాల వ్యవధి 2024 నుంచి 2029 నియంత్రణ కాలానికి సంబంధించి నెట్వర్క్ ఆదాయ అవసరాల నివేదికలను సమర్పించారు. నెట్వర్క్ ఆదాయ అవసరాల నివేదిక ట్రాన్స్కో కూడా సమర్పించింది. ఏపీఈఆర్సీ ఛైర్మన్ జస్టిస్ సీవీ నాగార్జునరెడ్డి, సభ్యులు ఠాకూర్ రామసింగ్ కు ఇంధన శాఖ కార్యదర్శి కె విజయానంద్ సమక్షంలో ట్రాన్స్కో జెఎండి కెవిఎన్ చక్రధర్ బాబు ఐఎఎస్, దక్షిణ, తూర్పు, మధ్య ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఎపిఎస్పీడీసీఎల్, ఏపీఈపీడీసీఎల్, ఎపిసీపీడీసీఎల్)ల సీఎండీలు కే. సంతోష రావు, పథ్వీతేజ్ ఇమ్మడి, జె పద్మాజనార్ధనరెడ్డిలు సమగ్ర ఆదాయ ఆవశ్యకత (ఏఆర్ఆర్) నివేదికలను అందజేశారు.

కలెక్టర్ దృష్టికి సత్యవేడు సమస్యలు

- పరిష్కరించాలని ఎమ్మెల్యే ఆదిమూలం వినతి



ప్రజాశక్తి-పిచ్చాటూరు: సత్యవేడు నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలపై ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. గురువారం జిల్లా కలెక్టర్‌లో కలెక్టర్‌ని కలసి వినతి పత్రం అందజేశారు. ప్రధానంగా వర్షానికి దెబ్బతిన్న రోడ్లుకు నిధులు కేటాయింపు, పిచ్చాటూరులో పేదలకు భూ పంపిణీ, వరదయ్యపాళెంలో పెండింగ్‌లో ఉన్న ఇంటి పట్టాల సమస్యల పరిష్కారం వంటి సమస్యలపై విజ్ఞప్తి చేశారు. అలాగే నియోజకవర్గంలో ఖాళీగా ఉన్న అంగన్వాడీ పోసులు భర్తీ చేయాలని విన్నవించారు.

డేటా సైన్స్‌లో సాంఖ్యక శాస్త్రం ముఖ్యపాత్ర పోషిస్తుంది:విసి

ప్రజాశక్తి-క్యాంపస్: ప్రస్తుత ఆధునిక రంగంలో డేటా సైన్స్‌లో సాంఖ్యక శాస్త్రం డేటా విశ్లేషణలో ముఖ్యపాత్ర పోషిస్తుందని పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య భారతి పేర్కొన్నారు. వర్సిటీలో గణాంకశాస్త్ర విభాగం, ఇండియన్ సొసైటీ ఫర్ ప్రాబబిలిటీ అండ్ స్టాటిస్టిక్స్ (ఐఎస్పిఎస్) సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి బిఎస్సి స్టాటిస్టిక్స్ హానర్స్ కోర్సు ప్రారంభోత్సవాన్ని మహిళా వర్సిటీ సావేరి అతిథి గృహంలో ఘనంగా ప్రారంభించారు. కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో ప్రొ.తంగరాజ్, ప్రొఫెసర్ ఎన్.బాలకష్ణ, జి.ఎస్.నటరాజన్ స్టాటిస్టిక్స్ డిపార్ట్‌మెంట్ హెడ్ ఇంఛార్జి డాక్టర్ శివపార్వతి ప్రొఫెసర్ పి.రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

లబ్ధిదారులకు భూ పంపిణీ



ప్రజాశక్తి-గూడూరుటౌన్: గూడూరు పట్టణంలోని డిఎన్ఆర్ కమ్యూనిటీ హాల్లో పేదలకు భూ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే వరప్రసాద్ రావు, ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ్ చక్రవర్తి, ఆర్డీవో కిరణ్ పాల్గొన్నారు. లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేశారు. ఆర్డీవో మాట్లాడుతూ భూ పంపిణీ కార్యక్రమం పారదర్శకంగా నిర్వహించామన్నారు. 12 సంవత్సరాల అనంతరం పేదలకు భూ పంపిణీ కార్యక్రమం నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. తాను తహశీల్దార్‌గా పనిచేస్తున్న సమయంలో 7 విడతలుగా భూ పంపిణీ కార్యక్రమం ద్వారా 4500 మందికి పట్టాలు ఇవ్వడం జరిగిందని, తన చేతుల మీదగా జరగడం ఆనందంగా ఉందని తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదలకు భూములు అందించడంతో సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు గోపాల్‌రెడ్డి, మీరారెడ్డి, జెడ్పీటీసీ యామిని పాల్గొన్నారు.

అందరికీ న్యాయం ఏక్తా లక్ష్యం



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: అట్టడుగు వర్గాల ప్రజలకు సైతం న్యాయమందించడమే ఏక్తా లక్ష్యమని ఆల్ ఇండియా యాంటీ కరప్షన్ సౌత్ ఇండియా ప్రెసిడెంట్ అబ్దుల్ రెహమాన్ అన్నారు. పట్టణంలోని పెద్ద మసీదు వీధిలో గురువారం ఏక్తా యాంటీ కరప్షన్ జిల్లా సమావేశం జరిగింది. ముఖ్య అతిథి పాల్గొన్న అబ్దుల్ రెహమాన్ మాట్లాడుతూ ఏక్తా యాంటీ కరప్షన్ ద్వారా సామాజిక కార్యక్రమాలు చేయాలన్నారు. చట్టాలను కొందరు చుట్టాలుగా మార్చుకుంటున్నారనీ, పేదల హక్కులను కాల రాస్తున్నారన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రతి సంక్షేమ పథకం నిరుపేదలకు అందాలన్నారు. ఆపదలో ఉన్న వారికి న్యాయం చేయాలనీ, అవసరమైన చోట న్యాయపోరాటం చేయాలని జిల్లా కార్యవర్గానికి పిలుపునిచ్చారు. నాయకులు లాల్ బాషా, మహబూబ్ బాషా, డాక్టర్ ఫర్ మాన్ సిద్ధిక్, ఆసిఫ్, అక్బర్, సల్మాన్ రాజు, పి.యాసిన్ పాల్గొన్నారు.

ఉద్యోగం వచ్చే వరకూ పోరాడుదాం..

- పిడిఎస్‌యు మాజీ రాష్ట్ర కార్యదర్శి సిఎస్.సాగర్

ప్రజాశక్తి-గూడూరురూరల్: చదువు పూర్తి చేసుకున్న ప్రతి నిరుద్యోగికీ ఉద్యోగం వచ్చేంత వరకు పోరాటం సాగిద్దామని పిడిఎస్‌యు మాజీ రాష్ట్ర కార్యదర్శి సిఎస్ సాగర్ అన్నారు. గురువారం పట్టనంలోని రిటైర్డ్ ఎంప్లాయీస్ భవనంలో నెల్లూరు జిల్లా పిడిఎస్‌యూ మహాసభను ఘనంగా నిర్వహించారు. స్థానిక రైల్వే స్టేషన్ నుంచి పాత బస్టాండు వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పిడిఎస్‌యూ నాయకులు చరణ్, షారుక్, ఆశిర్ సంతోష్, విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం

- ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

ప్రజాశక్తి-రేణిగుంట: ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఎమ్మెల్యే బియ్యపు మధుసుదన్‌రెడ్డి అన్నారు. గురువారం రేణిగుంటలో 'మనవద్దకే-మన ఎమ్మెల్యే' కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రజా సమస్యలు తెలుసుకొని వాటి పరిష్కారానికి అక్కడికక్కడే అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీపీ హరిప్రసాద్‌రెడ్డి, జెడ్పిటిసి సంధ్యారాణి, సర్పంచ్ నగేష్, వైస్ ఎంపీపీ సుజాత, పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్, కో ఆప్షన్ మెంబర్ అసాన్ సాహెబ్, ఇర్ఫాన్, ముస్లిం మైనారిటీ జిల్లా అధ్యక్షులు షేక్ రసూల్ గంగారి రమేష్, రిజ్వాన్, దయాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమం జగనన్నకే సాధ్యం

- మంత్రి ఆర్‌కే రోజా

ప్రజాశక్తి-పుత్తూరుటౌన్: ప్రజలకు సంక్షేమ పాలన అందించడం జగనన్నకే సాధ్యమని మంత్రి ఆర్‌కె రోజా అన్నారు. గురువారం పుత్తూరు మున్సిపాలిటీ నందిమంగళం సచివాలయంలో చిన్నప్పనాయుడు కండ్రిగ, కోనప్పగుంట గ్రామాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలను పలకరించి సమస్యలను తెలుసుకొని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో నాయకులు హరి, జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

వెంకటగిరిరూరల్: మండలంలోని పారువోలు సచివాలయ పరిధిలో ఎపీకి జగనే ఎందుకు కావాలి కార్యక్రమాన్ని గురువారం వైసిపి మండల అధ్యక్షులు కాల్తిరెడ్డి శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ పుల్లూరు శ్రీదేవి, సర్పంచ్ నెల్లూరు అమ్ములు, నాయకులు వెంకటేశ్వర్లు, సదానందరెడ్డి, దొరస్వామి, ఇన్చార్జ్ ఎంపీడీవో విజయలక్ష్మి పాల్గొన్నారు.

రూ.కోట్ల భూములు ఆక్రమణ

- వార్డుల్లో ఎక్కడి సమస్యలు అక్కడే

- ప్రతి నెలా జరగాల్సిన సమావేశాన్ని మూడు నెలలకు జరపడమేంటి?

- మున్సిపాలిటీ కౌన్సిల్ సమావేశంలో కౌన్సిలర్లు ధ్వజం



ప్రజాశక్తి-వెంకటగిరి: రూ.కోట్లు విలువైన భూములు ఆక్రమణకు గురవుతున్నాయని వెంకటగిరి మున్సిపాలిటీ కౌన్సిలర్లు ధ్వజమెత్తారు. గురువారం మున్సిపల్ ఛైర్మన్ నక్క భానుప్రియ అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం జరిగింది. 25కు 25వార్డుల్లో వైసిపి కౌన్సిలర్లు ఉండగా ప్రతి నెలా కౌన్సిల్ సమావేశం ఎందుకు నిర్వహించడం లేదని, ప్రతి పక్షం లేని లోటు ఇట్టే తెలుస్తోందని కౌన్సిలర్లు డిల్లీబాబు, దొంతు శారద ఛైర్మన్, మున్సిపల్ కమిషనర్‌ను నిలదీశారు. ప్రతి సమావేశంలో విలువైన భూముల ఆక్రమణపై మాట్లాడుతున్నా.. అధికారులు ఆక్రమణదారులకు తొత్తులుగా వ్యవహరించి చర్యలు తీసుకోవడం లేదని మండిపడ్డారు. వార్డుల్లో ఎక్కడి సమస్యలు అక్కడే ఇబ్బడిమొబ్బడిగా ఉన్నాయని పరిష్కారానికి నోచుకోక ప్రజలకు సమాదానం చెప్పుకోలేక ఇబ్బందులు పడుతున్నామన్నారు.

రూ.370కోట్లతో మున్సిపాలిటీ అభివృద్ధి

- ఛైర్మన్ హరి

ప్రజాశక్తి-పుత్తూరుటౌన్: మున్సిపాలిటీలో రూ.370 కోట్లుతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని ఛైర్మన్ ఆనంగి హరి పేర్కొన్నారు. గురువారం అత్యవసర మున్సిపల్ కౌన్సిల్ సమావేశాన్ని వైఎస్సార్ భవనంలో నిర్వహించారు. గత సమావేశంలో అడిగిన గృహ మంజూరు వివరాలను అధికారులు ఇవ్వడం లేదని కౌన్సిలర్ బాలసుబ్రమణ్యం మండిపడ్డారు. ఎన్టీఆర్ కాలనీలో నీటి సమస్యపై సిబ్బందికి చెప్పినా నిర్లక్ష్య సమాదానంతో వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్డుపై వ్యాపారస్తులు బోర్డులు ఏర్పాటు చేయడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోందని సమావేశంలో లేవనెత్తారు. డ్రైనేజీ కాలువల్లో పూడిక తీయడం లేదని, మురికి నీరు రోడ్డుపైనే పారుతుండడంతో దోమలు విపరీతంగా ఉన్నాయని ఆరోపించారు. కొత్తగా పారిశుద్ధ్య కార్మికులను నియమించాలని కౌన్సిలర్ ఏకాంబరం కోరారు. 9వ వార్డు టిడిపి కౌన్సిలర్ మాట్లాడుతూ మా వార్డులో చెట్లు ఎక్కువగా ఉండడంతో దోమలు ఎక్కువగా ఉన్నాయని మందులు పిచికారులు చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని తెలిపారు.

డిజిటల్ విద్యతో ఉజ్వల భవిష్యత్

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: డిజిటల్ విద్యతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని సోషియల్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు కూనాటి సురేష్ అన్నారు. పట్టణంలోని బాబు ఆగ్రహారం మున్సిపల్ పాఠశాలలో గురువారం సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుల ప్రత్యేక సమావేశం జరిగింది. శ్రీకాళహస్తి, తొట్టంబేడు, కేవీబీ పురం మండలాలకు చెందిన సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు పాల్గొన్నారు. సభ్యులు ఫోరం ప్రతినిధులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఫోరం రాష్ట్ర అధ్యక్షులు కూనాటి సురేష్ మాట్లాడుతూ సాంఘిక శాస్త్రానికి అవసరమైన డిజిటల్ పవర్ పాయింట్లు, వీడియోలు, పాఠ్య ప్రణాళికలు, వార్షిక ప్రణాళికలు, బోధన అభ్యసన సామాగ్రి, బోధన మెలకువలు, ఆన్లైన్ క్విజ్జులు, మోడల్ పేపర్లు రాష్ట్ర ఫోరం తయారుచేసి అన్ని జిల్లాలకు ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. ఇందులో గౌరవాధ్యక్షులుగా బెల్లం సుధాకర్, అధ్యక్షులుగా మాధవయ్య, ప్రధాన కార్యదర్శిగా కుమార్, సహకార్యదర్శిగా వేములయ్య, కోశాధికారిగా చలం, మహిళా ప్రతినిధిగా నాగ శిరోమణి, ఉపాధ్యక్షులుగా నజీర్ ఖాన్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

గిరిజనులకు టిఫిన్ పంపిణీ

ప్రజాశక్తి-తొట్టంబేడు: వర్ష ప్రభావం వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్న గిరిజనులకు జాతీయ వినియోగదారుల హక్కుల కమిషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కలవగుంట భరత్‌రెడ్డి దాతృత్వాన్ని చాటుకొని టిఫిన్ పంపిణీ చేశారు. గురువారం మండలంలోని చిట్టత్తూరు పరిధిలోని గణపతి గిరిజన కాలనీలో సుమారు 55 కుటుంబాల గిరిజనులకు అల్పాహారం అందజేశారు. సీనియర్ పాత్రికేయులు వీసీ వెంకటయ్య, నాయకుడు రాపూరు సుబ్రహ్మణ్యం చేతుల మీదుగా పంపిణీ చేసి పేదల ఆకలి తీర్చారు. దీంతో ఆ కాలనీ గిరిజనులు కలవగుంట భరత్ రెడ్డికి, కృతజ్ఞతలు తెలిపారు.

గిరిజనులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: గిరిజనులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఆర్ఐ వెంకటసుబ్బయ్య అన్నారు. గురువారం మండలంలోని అరిగిలకండ్రిగ గిరిజన కాలనీలో సామాజిక న్యాయంపై రెవెన్యూ, మండల పరిషత్, పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలను చిన్నచూపు చూస్తే చట్టరిత్యా కేసు నమోదు చేస్తామన్నారు. ప్రభుత్వ పథకాలు అందకపోతే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. అనంతరం గిరిజనులు పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు మణినాయుడు, వీఆర్‌టీ భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏఎంసీ అభివృద్ధికి తోడ్పడండి

- డిప్యూటి సీఎంకు వినతి

ప్రజాశక్తి-నాయుడుపేట: నాయుడుపేట ఏఎంసీ అభివృద్ధికి నిధుల మంజూరు చేయాలని డిప్యూటి సీఎం నారాయణస్వామికి ఏఎంసీ ఛైర్మన్ తండిరెడ్డి జనార్ధన్‌రెడ్డి విన్నవించారు. గురువారం డిప్యూటి సీఎంని ఆయన స్వగృహంలో కలసి పుష్పగుచ్ఛం అందజేశారు. పలు రాజకీయ అంశాలు చర్చించినట్లు తంబిరెడ్డి తెలిపారు. ఆయన వెంట మాజీ ఏఎంసీ డైరెక్టర్ నాగిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ఉన్నారు.

మాజీ శాసనమండలి ఛైర్మన్ షరీఫ్‌ను కలిసిన జలీల్ అహ్మద్

ప్రజాశక్తి-కోట: నెల్లూరులో నిర్వహించిన మైనార్టీ ఆత్మీయ సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న మాజీ శాసన మండలి ఛైర్మన్ షరీఫ్‌ని కోట మండలం తిరుపతి పార్లమెంట్ టీడీపీ మైనార్టీ అధ్యక్షులు, ఎస్‌కెబి అధినేత షేక్ జలీల్ అహ్మద్ మర్యాదపూర్వకంగా కలిశారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

ప్రజాశక్తి-ఏర్పేడు: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సర్పంచ్ మోహన్‌ప్రియ గ్రామస్తులకు సూచించారు. గురువారం సచివాలయ సిబ్బందితో కలసి గ్రామాల్లో పర్యటించారు. వర్షానికి రోడ్లపై నిల్వ నీటిని, వ్యర్థాలను తీయించారు. తాగునీటి బోర్లు వద్ద మరమ్మతులు చేపట్లాని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి లోకమణి, సిబ్బంది ప్రియదర్శిని, భారతి, వినోద్ పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: పట్టనంలోని ప్రాజెక్టు వీధికి చెందిన మునికుమార్ ఇటీవల మృతి చెందారు. గురువారం శ్రీకాళహస్తికి వచ్చిన ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం మునికుమార్ కుటుంబ సభ్యులను పరామర్శించి నిత్యావసరాలను పంపిణీ చేశారు. రత్నంరెడ్డి, వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ స్వామిరెడ్డి, భరత్‌కుమార్‌రెడ్డి, బజాజ్ మురళికృష్ణ, సున్నపు బాలసుబ్రమణ్యం పాల్గొన్నారు.

ఆయుర్వేద విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్

- టీటీడీ జెఈఓ సదా భార్గవి

ప్రజాశక్తి-తిరుపతి బ్యూరో:

భారతీయ ప్రాచీన వైద్య విధానమైన ఆయుర్వేదానికి ప్రపంచ స్థాయిలో గుర్తింపు లభిస్తోందని, రానున్న కాలంలో ఆయుర్వేద విద్యార్థులకు ఉజ్వలమైన భవిష్యత్తు ఉంటుందని టీటీడీ జెఈఓ సదా భార్గవి చెప్పారు. తిరుపతిలోని ఎస్వీ ఆయుర్వేద కళాశాలలో ఈ విద్యా సంవత్సరంలో చేరిన నూతన విద్యార్థులకు నేషనల్ కమిషన్ ఫర్ ఇండియన్ సిస్టం ఆఫ్ మెడిసిన్ సంస్థ ఆదేశాల మేరకు 15 రోజులపాటు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గురువారం జరిగిన ఈ కార్యక్రమం ముగింపు సభకు జెఈఓ ముఖ్యఅతిథిగా విచ్చేశారు. జెఈఓ మాట్లాడుతూ శ్రీవారి అనుగ్రహంతో, పూర్వజన్మ సుకృతం వల్ల ఎస్వీ ఆయుర్వేద కళాశాలలో విద్యార్థులకు ప్రవేశం లభించిందన్నారు. కళాశాల చేరిన విద్యార్థులు భగవంతుని పట్ల కృతజ్ఞతాభావంతో ఉండాలని కోరారు. ఆయుర్వేదానికి కీలకమైన సంస్కృత భాషను తప్పకుండా నేర్చుకోవాలని సూచించారు. టీటీడీ ఛైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, ఈవో ఏవి.ధర్మారెడ్డి ఆదేశాల మేరకు కళాశాలను ప్రగతి పథంలో ముందుకు తీసుకెళ్తున్నట్టు తెలియజేశారు. కళాశాల ప్రిన్సిపాల్, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రేణు దీక్షిత్ మాట్లాడుతూ టీటీడీ యాజమాన్యం సహకారంతో కళాశాలలో నాణ్యమైన విద్యాబోధన జరుగుతోందని, పేదరోగులకు ఉచితంగా మెరుగైన ఆయుర్వేద వైద్యం అందిస్తున్నామని తెలియజేశారు. కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ డాక్టర్ విజయభాస్కర్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస కుమార్, ఫార్మసీ ఇన్చార్జ్ డాక్టర్ రమేష్ బాబు, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సుబ్బారెడ్డి, కో-ఆర్డినేటర్లు డాక్టర్ వెంకట శివుడు, డాక్టర్ రష్మీబండేకర్, డాక్టర్ సోమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.